సాక్షి
నిజామాబాద్
గురువారం । 18 । జూలై । 2024



వెల్మల్‌లో దొంగల బీభత్సం
నందిపేట మండలం వెల్మల్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న మూడిళ్లలో చోరీ చేశారు.
- 8లో ▸



సొంతింటి కల..
ఇల్లు కట్టుకునే వారికి రూ.5 లక్షల సాయంపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయక పోవడంతో అనేక మంది నిరీక్షిస్తున్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.4 /23.3
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన 4468 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి 436 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1063.20 (13.8 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

అటవీ భూమి పంచాయితీపై ఇంటెలిజెన్స్ ఆరా

మోపాల్ : మండలంలోని మంచిప్ప శివారులోగల రాజులమర్రి గుట్టపై అమ్రాబాద్, మంచిప్ప గిరిజనుల మధ్య అటవీ భూమి పంచాయితీపై ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులు స్థానిక పోలీసులు, అటవీశాఖ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించారు. రాజులమర్రి గుట్ట విస్తీర్ణం.. మొక్కలు ఎందుకు నాటడం లేదు.. గిరిజనులు సాగు చేస్తుంటే చర్యలు ఎందుకు చేపట్టడం లేదు.. తదితర వివరాలు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో రవిమోహన్ భట్‌ను ఫోన్లో అడిగి వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది. అటవీ జంతువులు సేద తీరే ప్రాంతం కోసం స్థలాన్ని ఖాళీగా వదిలేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఇరు గ్రామాల ప్రజలకు ఆ భూమిలో సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. కాగా ఈ విషయం రచ్చకెక్కడంతో ఇరు గ్రామాల గిరిజనుల సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు కొందరు రాజకీయ పెద్దలు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. అటవీ భూమిని ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటారా.. లేక గిరిజనుల సాగుకు వదిలేస్తారా అనేది తేలాల్సి ఉంది.

కలెక్టర్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సమన్లు?

సుభాష్‌నగర్: జిల్లా కలెక్టర్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ సమన్లు జారీ చేసినట్లు బుధవారం తెలిసింది. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బాలికపై ఆగస్టు 28, 2022లో చంద్రశేఖర్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈవిషయమై అప్పట్లో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. కేసు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. కాగా అత్యాచారానికి గురైన బాధితురాలికి పరిహారం చెల్లించాలని చట్టంలో ఉంది. చట్టాన్ని అమలు చేయడంలో కాలయాపన జరుగుతుండటంతో బాధితురాలు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించగా, పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశించింది. అయినప్పటికీ జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంతో బాధితురాలు మరోసారి కమిషన్‌ను కలిశారు. దీంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ కలెక్టర్‌కు సమన్లు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని వరంగల్ పౌరహక్కుల సంఘం కార్యకర్త బక్క జడ్సన్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

లింగంపేటలో 'డెంగీ' బెల్స్!

లింగంపేట: లింగంపేట మండలంలో రోజురోజుకు డెంగీ కేసులు పెరుగుతున్నాయి. మూడు రోజుల్లో పది కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఏడు డెంగీ కేసులు నమోదయ్యాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. పోతాయిపల్లి, పొల్కంపేట, మెంగారం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయన్నారు. మరో 40 మంది వరకు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.



పట్టు బిగించిన పోచారం

అభివృద్ధి పనులను మంజూరు చేయించి అమలు చేయడంలో మంచి పేరు పొందిన పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఈ క్రమంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో విజయావకాశాలు మరింతగా మెరుగయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక సీఎం రేవంత్‌రెడ్డితో తనకున్న సాన్నిహిత్యం కారణంగా ఉమ్మడి జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని పోచారం ప్రకటించారు.

■ అభివృద్ధి పనులను మంజూరు చేయించడంలో, పథకాలను తీసుకురావడంలో దిట్టగా పోచారం పేరుపొందారు. బాన్సువాడ నియోజకవర్గంలో సాగునీరు అందించే విషయంలో శ్రీనివాసరెడ్డి చేసిన కృషి గురించి ప్రతి ఒక్కరూ చెబుతారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి ప్రాంతంపై పట్టున్న ఈయనకు బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి అంగుళం గురించి క్షుణ్ణంగా తెలుసని అంటారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో రాష్ట్రంలోనే అత్యధికంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క బాన్సువాడ నియోజకవర్గంలోనే 15 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేయించి లబ్ధిదారులకు కేటాయించారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పోచారం నకు మొదటి నుంచి మంచి సాన్నిహిత్యం ఉంది. దీంతో కాంగ్రెస్‌లో చేర్చుకునే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ స్వయంగా పోచారం ఇంటికే రావడం గమనార్హం. రేవంత్ సహకారంతో జిల్లాలో మరింత అభివృద్ధి చేస్తానని పోచారం ప్రకటించారు.

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి ఊపు
- స్థానిక ఎన్నికల్లో భారీ విజయాలకు అవకాశం : విశ్లేషకులు
- అభివృద్ధిలో పట్టువదలని విక్రమార్కుడిగా పేరు
- 'ఏనుగు' వెనక్కు వెళ్లాల్సిన అనివార్య పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కొనసాగుతున్న సీనియర్ నేత పోచారం శ్రీనివాసరెడ్డి క్లాస్, మాస్ లీడర్‌గా ఉమ్మడి జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు. అభివృద్ధి విషయంలో పట్టువదలని విక్రమార్కుడిగా పేరుపొందిన పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆ పార్టీ ఉమ్మడి జిల్లా శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది. అభివృద్ధి పనులు సాధించడం, వాటిని అమలు చేయించే విషయంలో దిట్టగా పేరున్న ఈ సీనియర్ నేత పార్టీ కార్యకలాపాల నిర్వహణ విషయంలోనూ కమిటెడ్‌గా వ్యవహరిస్తారనే పేరుంది. దీంతో ఆయన చేరిక పట్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుల్లో సైతం సానుకూలత వ్యక్తమవుతోంది. మాజీ మంత్రిగా, స్పీకర్‌గా హుందాతనంగా, మంచి పనితీరుతో వ్యవహరించిన శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన కుమారుడు పోచారం భాస్కర్ రెడ్డి సైతం డీసీసీబీ చైర్మన్‌గా పనిచేయడంతో రాజకీయంగా ఆ కుటుంబం మంచి పట్టు కలిగి ఉంది. ఈ క్రమంలో బీజేపీ నుంచి పోటీ ఎదురుకానున్న పరిస్థితుల్లో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రజాపరిషత్‌లను కాంగ్రెస్ సునాయాసంగా గెలుచుకునే అవకాశాలు మరింతగా మెరుగయ్యాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అదేవిధంగా మండల ప్రజాపరిషత్‌లు, మున్సిపాలిటీలు, సర్పంచ్‌లను భారీగా గెలుచుకుంటుందని విశ్లేషణలు చేస్తున్నారు.

■ బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కాసుల బాలరాజు పోచారం శ్రీనివాసరెడ్డి చేరికను ఆహ్వానించారు. బాలరాజు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంలో ఈ నెల 15న బాన్సువాడలో భారీ సభ ఏర్పాటు చేశారు. కొత్త, పాత అనే తేడాలేకుండా పార్టీలోని నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకుని ముందుకు వెళతానని పోచారం ప్రకటించారు. ఈ సభలో కాసుల బాలరాజు మాట్లాడుతూ అభివృద్ధిని కాంక్షించే పోచారం చేరిక మంచి పరిణామమన్నారు.

■ ఏనుగు రవీందర్‌రెడ్డి గురించి కాసుల బాలరాజు వ్యాఖ్యలు చేయడం విశేషం. తాను 15 ఏళ్లుగా పోచారంపై పోరాటం చేశానన్నారు. అయినప్పటికీ పోచారంతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. బయటి నుంచి వచ్చిన వాళ్లు దుకాణం మూసేసుకుని వెనక్కు వెళ్లాల్సిందేనని ఏనుగు రవీందర్‌రెడ్డిని ఉద్దేశించి బాలరాజు వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాన్సువాడకు వెళ్లొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇప్పటికే ఏనుగుకు చెప్పినట్లు సమాచారం.



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

రుణం డబ్బులు కాజేసిన మేనేజర్

- యూనియన్ బ్యాంక్‌లో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- సుమారు రూ.5 కోట్ల స్కాం



మేనేజర్ అజయ్

ఖలీల్‌వాడి : వినియోగదారుల రుణం డబ్బులు బ్యాంక్ మేనేజర్ కాజేసిన ఘటన నిజామాబాద్ నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలోని యూనియన్ బ్యాంక్‌లో చోటు చేసుకుంది. బ్యాంక్ మేనేజర్ అజయ్ వినియోదారులను నమ్మించి వారి రుణం డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఈ ఘటనపై నగరంలోని నాలుగో టౌన్ పోలీసులకు బుధవారం పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. బ్యాంక్ మేనేజర్ అజయ్ బ్యాంక్‌కు వచ్చే కస్టమర్లను మచ్చిక చేసుకునేవాడు. వివిధ లోన్‌ల కోసం వచ్చే వారిని నమ్మించి వారికి అవసరం ఉన్నదానికంటే ఎక్కువ లోన్ ఇచ్చేవాడు. మిగతా రుణం డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకునేవాడని బాధితులు ఆరోపిస్తున్నారు. రుణాలు తీసుకున్న ఖాతాదారులకు మెసెజ్‌లు రావడంతో వారు బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశారు. దీంతో మేనేజర్‌పై ఒత్తిడి పెరగడంతో పరార్ అయ్యారు. ఈ విషయాన్ని బ్యాంక్ సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ బ్యాంక్ పరిధిలో ఉన్న ఫైనాన్స్ నిర్వాహకులు, వ్యాపారులకు మేనేజర్ తన చెక్కులు ఇచ్చి, వారి పేరిట వచ్చిన రుణం డబ్బులను మళ్లించుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన పుల్లూరి రాకేశ్ తను ష్యూరిటీ పెట్టిన డాక్యుమెంట్లతో రూ.20 లక్షలు మేనేజర్ తీసుకున్నారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మరో 23 మంది బాధితులు అజయ్‌పై ఫిర్యాదు చేశారు. మరో 19 మంది బాధితులు ఉన్నట్లు తెలిసింది. వీరి నుంచి సుమారు రూ.5కోట్ల వరకు రుణాలను మేనేజర్ అజయ్ కాజేసినట్లు సమాచారం. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాండేరావు తెలిపారు.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్ : డీఎస్సీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఆగస్టు 7 వరకు కొనసాగనున్నాయి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థులకు కేటాయించిన తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. మొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో డీఎస్సీ పోస్టులు 640 మంజూరు కాగా సుమారు 7000 మంది వ రకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో నాలెడ్జ్ పార్క్ స్కూల్ పరీక్ష కేంద్రం కేటాయించారు. ఇక్కడ 2,600 మంది పరీక్ష రాయనున్నారు. మిగతా వారికి హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో కేంద్రాలను కేటాయించారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే రావాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకు రావాల్సి ఉంటుంది.

నేరుగా రైతుల ఖాతాల్లోకి మాఫీ సొమ్ము

- నేడు జిల్లాలో 44,469 మందికి రూ.లక్షలోపు రుణమాఫీ
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఖలీల్‌వాడి : ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన మాట్లాడారు. గురువారం రూ.లక్ష వరకు రుణమాఫీ అమలు చేస్తామని చెప్పారు. సాయంత్రం రైతుల ఖాతాలలోకి నేరుగా రుణమాఫీ డబ్బులు వస్తాయని చెప్పారు. రైతులు రుణమాఫీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి తొమ్మిది ఏళ్లు కాలయాపన చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదట రూ.లక్ష మాఫీ చేసి, తర్వాత వారం రోజుల్లో రూ.1.50 లక్షలలోపు రుణాలు, ఆగస్టు మొదటి వారంలో రూ.రెండు లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తుందన్నారు. రైతుల ఖాతాలలోకి వచ్చిన రుణమాఫీ డబ్బులను బ్యాంకర్లు ఇతర లోన్లకు వాడకుండా నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 5,736 మంది రైతులకు, బాల్కొండలో 7,120 మంది, జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గ మండల్లాలో 7,609 మంది, బోధన్‌లో 12,026, నిజామాబాద్ రూరల్‌లో 11,866, నిజామాబాద్ అర్బన్‌లో 112 మంది రైతులకు మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణమాఫీ జరుగుతుందన్నారు. గ్రామాలకు రైతు రుణమాఫీకి సంబంధించిన జాబితా వచ్చినట్లు తెలిపారు. గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంబురాలకు రైతు వేదికలు సిద్ధం

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం



మోర్తాడ్‌లోని రైతు వేదిక

డొంకేశ్వర్(ఆర్మూర్)/మోర్తాడ్: రైతుల పంట రుణాల మాఫీకి రాష్ట్ర ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టనుంది. రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు గురువారం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేయనుంది. సాయంత్రం 4 గంటలకు సంబంధిత రైతుల ఖాతాల్లో నగదు జమ కానున్న నేపథ్యంలో రైతులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు జిల్లాలో సంబరాలు నిర్వహించడానికి 31 రైతు వేదికలను సిద్ధం చేశారు. తోరణాలతో ముస్తాబు చేశారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఒకటికి రెండుసార్లు టెస్టింగ్ నిర్వహించారు. రైతు వేదికకు విద్యుత్ సరఫరా ఉండేలా ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలిచ్చారు. నిర్వహించే సంబరాలకు హాజరుకావాలని రుణమాఫీ జరిగే రైతులకు ముందుగానే సమాచా రం అందించారు. రైతులతో పాటు ప్రజాప్రతినిధు లు, ఉన్నతాధికారులకు ఆహ్వానాలు అందాయి. రు ణమాఫీ జరిగిన వెంటనే కాంగ్రెస్ శ్రేణులు, రైతులు బైక్‌ర్యాలీలు నిర్వహించి టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకోనున్నారు. జిల్లాలో రూ.లక్షలోపు పంటరుణాలు తీసుకున్న రైతులు 92,554 మంది ఉ న్నారు. రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతు లు ఒక లక్షా 12 వేల మంది ఉన్నారు. ఎంతమంది రైతులకు లక్షలోపు రుణం మాఫీ కానుందో నేడు తెలియనుంది. కాగా రూ.లక్షకుపైగా రుణం ఉన్న రైతులు తమకు ఎప్పుడు మాఫీ చేస్తారోనని ఎదురు చూస్తున్నారు.

రైతు ఖాతా నుంచి రూ.4.16 లక్షలు మాయం

వాట్సాప్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతో..



బాధిత రైతు ముత్యంరెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్) : స్మార్ట్‌ఫోన్‌కు వచ్చిన బ్యాంకు లోగోతో కూడిన లింక్‌ను క్లిక్ చేయడంతో ఓ రైతు ఏకంగా రూ.4,16,800 పోగొట్టుకున్నాడు. ఈ ఘటన డొంకేశ్వర్ మండలం గంగసరంలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయం చేస్తున్న గుండేటి ముత్యంరెడ్డికి నూత్‌పల్లి యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. కూతురి పెళ్లి కోసమని డబ్బును పోగుచేశాడు. ఈ నెల 10న గుర్తుతెలియని నంబరు నుంచి ముత్యం రెడ్డికి వాట్సాప్‌లో బ్యాంకు లోగోతో కూడిన లింక్ ఒకటి వచ్చింది. అదే రోజు మరొక లింకు కూడా వచ్చింది. మరుసటి రోజు లింకును క్లిక్ చేయడంతో ఓటీపీలతో పాటు 9361158830 నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి హిందీలో మాట్లాడడంతో ముత్యంరెడ్డి కట్ చేశాడు. 12న బ్యాంకు ఖాతా నుంచి రూ.2లక్షలు ఒకసారి, రూ.లక్ష మరొకసారి, రూ.50వేలు, రూ.66,800 కట్ అయినట్లు ఫోన్‌కు మెసెజ్ వచ్చింది. వెంటనే యూనియన్ బ్యాంకుకు వెళ్లి ఖాతాను ఫ్రీజ్ చేయించాడు. సైబర్ క్రైం నంబర్‌కు ఫోన్ చేయడంతో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కూతురు పెళ్లి కోసం దాచిన డబ్బులు పోగొట్టుకోవడంతో ముత్యంరెడ్డి లబోదిబోమంటున్నాడు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చిన లింకులను క్లిక్ చేయవద్దని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై ప్రజలకు సూచించారు.

జిల్లాలో 36 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి 36.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నవీపేట్‌లో 15.4 సెంటీమీటర్లు, ఎడపల్లిలో 14.0 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో రెండ్రోజులుగా వర్షాలు కురవడంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. కూలీలకు డిమాండ్ పెరగడంతో కూలి పెంచేశారు. వర్షాలతో చెరువులు, రిజర్వాయర్లలోకి స్వల్పంగా నీరు వచ్చి చేరుతోంది. మరో రెండ్రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ కేంద్రం ప్రకటించింది. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 9 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 18 మండలాల్లో సాధారణ, 6 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

వర్షపాతం వివరాలు (మి.మీ.లో..)

మండలం	వర్షపాతం					మోస్రా	33.0
నవీపేట్	154.2	నిజామాబాద్‌సౌత్	51.3	మాక్లూర్	37.1	రుద్రూర్	30.5
ఎడపల్లి	140.7	కోటగిరి	49.7	బాల్కొండ	36.8	నిజామాబాద్‌నార్త్	29.9
రెంజల్	72.7	నిజామాబాద్‌రూరల్	48.2	డిచ్‌పల్లి	35.6	వర్ని	29.9
బోధన్	58.3	పోతంగల్	38.3	చందూర్	34.2	డొంకేశ్వర్	28.5
నందిపేట్	55.6	సాలూర	38.0	మోపాల్	33.8	జక్రాన్‌పల్లి	28.0

మరుగుదొడ్లు కట్టకున్నా బిల్లులు

నిజామాబాద్ నాగారం : సబ్‌స్టేషన్‌లో మరుగుదొడ్డి, టాయిలెట్ కట్టకున్నా బిల్లులు తీసుకున్నారు. ఈ ఘటన వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో చోటుచేసుకోగా తాజాగా అధికారుల తనిఖీతో వెలుగు చూసింది. గతంలో సబ్ స్టేషన్‌లలో మరుగుదొడ్లు లేకుండానే నిర్మించారు. దీంతో సిబ్బంది ఇబ్బందులను గుర్తించిన సీఎండీ టాయ్‌లెట్, మరుగుదొడ్లు నిర్మించాలని గతంలో ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం నిధులు కూడా మంజూరు చేశారు. అయితే జిల్లాలోని చాలా సబ్‌స్టేషన్లలో మరుగుదొడ్లు కట్టకున్న కట్టినట్లు బిల్లులు డ్రా చేశారని ఆరోపణలు ఉన్నాయి. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో అధికారులు తనిఖీ సమయంలో మరుగుదొడ్డి కట్టకున్నా బిల్లులు తీసుకున్నట్లు వెలుగు చూసింది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆగమేఘాల మీద బుధవారం మరుగుదొడ్డి నిర్మాణానికి జేసీబీ సహాయం, కూలీలతో పనులు ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కట్టకున్నా బిల్లులు డ్రా చేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మరికొన్ని సబ్‌స్టేషన్లలో నాసిరకంగా పనులు చేశారని పేర్కొంటున్నారు. దీనిపై సివిల్ ఏఈ స్వామిని వివరణ కోరగా ఆ విషయం తనకు తెలియదన్నారు. తెలుసుకొని చెబుతానని తెలిపారు.



అంక్సాపూర్‌లో మరుగుదొడ్డి కోసం తవ్విన గుంత

అంగన్‌వాడీలకు శుభవార్త

- టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్
- గతంలో ప్రకటించిన దానిని రెట్టింపు చేసిన ప్రభుత్వం



మోర్తాడ్ : ఉద్యోగ విరమణ చేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచడానికి ప్రభుత్వం అంగీకరించింది. రిటైర్డ్ అయ్యే అంగన్‌వాడీ టీచర్‌కు రూ.రెండు లక్షలు, ఆయాకు రూ.లక్ష నగదును కానుకగా అందించాలని నిర్ణయించినట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. గతంలో ఆయాకు రూ.50వేలు, అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తాన్ని పెంచాలని మొదటి నుంచి అంగన్‌వాడీలు కోరుతున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే వారికి విరమణ ఆప్షన్ అమలు చేయలేదు. ఇటీవల 65 ఏళ్లు నిండిన వారిని రిటైర్డ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 282 మంది ఉద్యోగులు విరమణ పొందారు. ఇందులో ఆయాల సంఖ్యనే ఎక్కువగా ఉంది. వీరికి ఎలాంటి సాయం అందించలేదు. అంతలోనే మంత్రి సీతక్క ప్రకటన చేయడంతో రిటైర్డ్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెంచిన సాయం ఎప్పుడు అందిస్తారో ఇంకా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

న్యాయం జరిగింది

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ చేస్తే సాయం ఎక్కువ ఇవ్వాలని మేము చేసిన ఉద్యమానికి న్యాయం జరిగింది. మంత్రి ప్రకటనతో అంగన్‌వాడీ టీచర్‌లకు రూ.రెండు లక్షలు, ఆయాలకు రూ.లక్ష సాయం అందనుంది. ప్రభుత్వం తొందరగా సాయం అందించాలి.

– దేవగంగు, జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్

క్లుప్తంగా

21న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌ షిప్‌ పోటీలకు జిల్లా కేంద్రంలోని బీఎల్‌ఎస్‌ గార్డెన్‌లో ఈనెల 21న క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తైక్వాండో అసోసియేషన్‌ కార్యదర్శి, జేసీఐ జిల్లా అధ్యక్షుడు, కోచ్‌ మనోజ్‌కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌ నగరంలోని బీఎల్‌ఎస్‌ గార్డెన్‌లో నిర్వహించే మా అమెచర్‌ తైక్వాండోకు తెలంగాణ తైక్వాండో అసోసియేషన్‌, నిజామాబాద్‌ ఒలింపిక్‌ అసోసియేషన్‌, స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా, తెలంగాణ ఒలింపిక్‌ అసోసియేషన్‌తో గుర్తింపు ఉన్న ఏకైక అసోసియేషన్‌ తమదేనని మనోజ్‌ పేర్కొన్నారు. బాలబాలికలకు క్యూరోగి, పూంసే జిల్లాస్థాయి చాంపియన్‌షిప్‌ ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అమెచర్‌ తైక్వాండో అసోసియేషన్‌కు గుర్తింపు ఉందని, మరే సంఘానికి గుర్తింపు లేదని క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రులు గ్రహించాలని కోరారు. 21వ తేదీన బాల బాలికలకు నిర్వహించనున్న క్యూరోగి, పూంసే పోటీలకు క్రీడాకారులు హాజరై రానున్న కాలంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు 79899 58068 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చైన్‌ స్నాచింగ్‌

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన దడివే పోసాని మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. సావెల్‌ రోడ్డు వైపు ఉన్న తమ పంటపొలానికి కాలినడకన వెళ్తుండగా బైక్‌పై వచ్చిన దుండగులు మెడలోని తులన్నర గొలుసు లాక్కెళ్లారని బాధితురాలు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపింది.

టోల్‌ప్లాజా వద్ద లారీ బోల్తా



భిక్కనూరు : ఓవర్‌ టేక్‌ చేసి ముందుకు వచ్చిన కారును ఢీకొన్న లారీ బోల్తాపడింది. ఈ ఘటన భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన ఓ న్యాయవాది హైదరాబాద్‌ నుంచి వస్తూ టోల్‌ప్లాజా వద్ద వెదురు బొంగులతో వెళ్తున్న లారీని ఓవర్‌టేక్‌ చేశాడు. ఈక్రమంలో లారీ కారును ఢీకొనగా భయంతో లారీ డ్రైవర్‌ కిందికి దూకేశాడు. కొంతదూరం వరకు వెళ్లిన లారీ రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురి అదృశ్యం



సంగయ్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి సంగయ్య(50) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఎలుపుగొండ గ్రామానికి చెందిన సంగయ్య ఈనెల 16న ఉదయం 7:30కు బాత్‌రూం కి వెళ్లొస్తానని తన భార్యకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పశువుల కాపరి..



ముఖేశ్‌

మోపాల్‌: మండలంలోని ముదక్‌పల్లిలో పశువుల కాపరిగా పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఖేశ్‌ అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్‌ బుధవారం తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో ఉంటున్న ముఖేశ్‌ తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ముఖేశ్‌ అన్నయ్య దినేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎడపల్లికి చెందిన కూలీ..



చిన్నసాయిలు

ఎడపల్లి(బోధన్‌) :మండల కేంద్రానికి చెందిన మొగిలి చర్ల చిన్నసాయిలు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 11న కూలీ పనికి వెళ్లిన చిన్న సాయిలు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మండలానికో ‘రైతు నేస్తం’

- రైతన్నకు మరింత చేరువకానున్న ఆధునిక పరిజ్ఞానం
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం



మెంట్రాజ్‌పల్లి రైతు వేదిక

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానం రైతులకు మరింత చేరువ కానుంది. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక పద్ధతులు క్షేత్రస్థాయికి తీసుకు వెళ్లడంతోపాటు రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి కొన్ని నెలల క్రితం ప్రయోగాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ‘రైతు నేస్తం’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌ నుంచి నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు అందిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎంపిక చేసిన ఒక రైతువేదికలో ప్రతి మంగళవారం ‘రైతు నేస్తం’ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఇక నుంచి ప్రతి మండలానికి ఒక రైతు నేస్తం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

31 రైతు వేదికల్లో ఏర్పాట్లు..

ప్రస్తుతం నిజామాబాద్‌ జిల్లాలో 106 రైతువేదికలు ఉన్నాయి. ఇప్పటి వరకు నియోజకవర్గానికి ఒక రైతు వేదికలో ‘రైతు నేస్తం’ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహిస్తూ వచ్చారు. రైతు నేస్తం కార్యక్రమం సత్ఫలితాలను ఇవ్వడంతో ఇక నుంచి మండలానికి ఒక రైతు వేదికలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి అనువుగా ఉండే రైతు వేదికలను ఎంపిక చేసి ఒక్కో రైతు వేదికలో రూ.3.75 లక్షల వ్యయంతో కంప్యూటర్‌, ప్రింటర్‌, ఎల్‌ఈడీ టీవీ, ఇంటర్‌నెట్‌ సదుపాయంతోపాటు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చారు. జిల్లాలోని 31 రైతు వేదికల్లో రైతు నేస్తం వీడియోకాన్ఫరెన్స్‌ల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వ్యవసాయశాఖ అధికారులు పూర్తి చేశారు.

ట్రయల్‌రన్‌ పూర్తి..

మండలానికి ఒక్కో రైతు వేదికలో ఏర్పాటు చేసిన ‘రైతు నేస్తం’ వీడియో కాన్ఫరెన్స్‌ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి గురువారం ప్రారంభించనున్నారు. బుధవారం ఆయా రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లను వ్యవసాయాధికారులు ట్రయల్‌ రన్‌ నిర్వహించి సరి చూసుకున్నారు.



వాన తెచ్చిన ఆనందం

కమ్ముకుంటున్న మేఘాలు వర్షించకపోవడంతో నిరాశకు గురైన రైతులు.. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరినాటు పనుల్లో జోరుపెంచారు. మూడు నుంచి నాలుగు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

– నిజామాబాద్‌ రూరల్‌

సొంతింటి కల నెరవేరేదెన్నడో?

- సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5లక్షలు ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పటి వరకు జారీకాని మార్గదర్శకాలు
- సాయం కోసం ఎదురు చూస్తున్న ప్రజలు



మోర్తాడ్‌(బాల్కొండ): సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకునేవారికి రూ.5లక్షల సాయం ప్రకటించిన ప్రభుత్వం అందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో సాయం ఎప్పుడు అందుతుందోనని అనేక మంది నిరీక్షిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం ఉన్నా ఆర్థిక వనరులు లేక ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించినా.. మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనే ఇళ్ల నిర్మించింది. అక్కడక్కడ ఇంకా నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో లబ్ధిదారులకు పంపిణీ కాలేదు. సొంతంగా స్థలం ఉన్న వారికి రూ.3లక్షల సాయం ప్రకటించినప్పటికీ.. అది అమలయ్యే లోగా ప్రభుత్వం మారింది. కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఇంటి నిర్మాణ సాయం ఒకటి కాగా, అందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అయితే, మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో సాయం అందే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి నిర్మాణానికి సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

సాయం అందించాలి



ఇంటిని నిర్మించుకునేవారికి సాయంను అందించడాన్ని ప్రారంభించాలి. ఇప్పటికే కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటిపోయింది. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణానికి సాయం అందించకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

– సోమ పెద్ద రాజారెడ్డి, మాజీ సర్పంచ్‌, గుమ్మిర్యాల్‌

జూనియర్‌ లైన్‌మెన్‌పై దాడి

వేల్పూర్‌: మండలంలోని పోచంపల్లిలో జూనియర్‌ లైన్‌మెన్‌ సందీప్‌పై మాజీ ఉప సర్పంచ్‌ సీహెచ్‌ గంగారెడ్డి దాడి చేశారని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై వినయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్‌ ఎంప్లాయీస్‌ 1104 యూనియన్‌ ఆర్మూర్‌ డివిజన్‌ ప్రధాన కార్యదర్శి నరేందర్‌ నాయక్‌ తెలిపారు. కులసంఘం భవనానికి అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ కనెక్షన్‌ను తొలగిస్తుండగా, తమ సంఘానికి విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తావా.. అంటూ గంగారెడ్డి దాడి చేశాడని పేర్కొన్నారు. అలాగే గంగారెడ్డి నాలుగు విద్యుత్‌ కనెక్షన్లకు సంబంధించి రూ.35వేలు బకాయి ఉన్నాడని, వాటిని చెల్లించాలని కోరడంతో కక్ష పెంచుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాంసం వ్యాపారిపై..

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని శక్కర్‌నగర్‌ చౌరస్తాలో తనపై కొంత మంది వ్యక్తులు దాడి చేశారని మాంసం వ్యాపారి రాజేశ్వర్‌ బుధవారం ఫిర్యాదు చేశాడని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనాస్థలాన్ని పరిశీలించామని, సీసీ ఫుటేజీని సైతం పరిశీలిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఒకరి రిమాండ్‌

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : వర్ని మండలం కోకల్‌దాస్‌ తండాకు చెందిన మాంజ నరేశ్‌ను గంజాయి కేసులో రిమాండ్‌కు తరలించినట్లు బీర్కూర్‌ ఎస్సై రాజశేఖర్‌ బుధవారం తెలిపారు. వారంరోజుల క్రితం దుర్కిలో బాన్సువాడ మండలం పోచారంతండాకు చెందిన శివప్రసాద్‌ను గంజాయి కేసులో అదుపులోకి తీసుకుని విచారించగా, నరేశ్‌ ఆచూకీ తెలిసిందన్నారు. నరేశ్‌ ఇంటిపై దాడి చేయగా 200 గ్రాముల గంజాయి పట్టుబడిందని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన యువకుడు ఎజాజ్‌ కొట్టాల్‌ నుంచి ఎల్లారెడ్డికి బైక్‌పై వస్తుండగా ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న టాటాఏస్‌ వాహనం హాజీపూర్‌ శివారులో ఢీట్టింది. ఈ ఘటనలో గాయాపాలైన ఎజాజ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులుహైదరాబాద్‌కు రిఫర్‌ చేశారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

మాక్లూర్‌:మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో బుధవారం విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందింది. మేతకు వెళ్లిన గేదె విద్యుత్‌ తీగలు తగిలి మృతి చెందిందని బాధితుడు గొల్ల మహేశ్‌ తెలిపాడు. మృతి చెందిన గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, బ్యాంకులో రుణంతీసుకొని కొనుగోలు చేశానన్నాడు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

మాక్లూర్‌: మండలంలోని దుర్గానగర్‌తండా బస్‌ స్టాప్‌ వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం పడి ఉందని పోలీసులు బుధవారం తెలిపారు. యాచకురాలైన 75 ఏళ్ల వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందన్నారు. మృతదేహంపై ఎరుపు, తెలుపు నైటీ ఉందని, ముఖం గుర్తు పట్టే వీలులేకుండా ఉందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోపాల్‌లో బైక్‌ చోరీ

మోపాల్‌: బైక్‌ చోరీ చేసి ఎత్తుకెళ్తున్న దుండగుడు దాంట్లో పెట్రోల్‌ అయిపోవడంతో దాన్ని అక్కడే వదిలేసి మరో బైక్‌ను ఎత్తుకెళ్లాడు. రెండో బైక్‌లో సైతం పెట్రోల్‌ అయిపోవడంతో మరో బైక్‌ను ఎత్తుకెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన సలీం అనే వ్యక్తి ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైంది. బుధవారం ఉదయం ఇంటి ముందు వాహనం లేకపోవడంతో సలీం వెతికాడు. అయితే, తన ఇంటి వద్దే మరో బైక్‌ నిలిపి ఉండటాన్ని గమనించి ఆరా తీయగా, ఆ వాహనం జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు చెందిన ఏడుకొండలు అనే వ్యక్తి చెందిన బైక్‌గా తేలింది. ఆర్‌సీ ఆధారంగా వారిని సంప్రదించగా.. దుండగుడు తమ ఇంటి వద్ద మరో బైక్‌ను వదిలి తమ బైక్‌ను ఎత్తుకెళ్లాడని వారు తెలిపారు. దుండగుడు మొదట చోరీ చేసిన బైక్‌లో పెట్రోల్‌ అయిపోవడంతో ఏడుకొండలు ఇంటి వద్ద బైక్‌ను వదిలి.. ఏడుకొండలుకు చెందిన బైక్‌ను ఎత్తుకెళ్లాడు. మోపాల్‌కు రాగానే దాంట్లో సైతం పెట్రోల్‌ అయిపోవడంతో సలీం ఇంటి ఎదుట దాన్నివదిలి.. సలీం బైక్‌ను ఎత్తుకెళ్లాడు. మోపాల్‌లో దుండగుడు వదిలి వెళ్లిన బైక్‌ను పోలీసులు ఏడుకొండలుకు అప్పగించారు. సలీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రైం కార్నర్‌

నగరంలో యువకుడి దారుణహత్య



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నరహరి

ఖలీల్‌వాడి: నగరంలో బీహార్‌కు చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. ఓ దుకాణం ఎదుట రక్తపుమడుగులో యువకుడు పడి ఉండటంతో సదరు దుకాణం యజమాని బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ నరహరి బుధవారం వెల్లడించారు.బీహార్‌కు చెందిన ఆనంద్‌ బిహారీ పాండే(22) నగరంలోని వినాయక్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి తనకు తలనొప్పిగా ఉందని.. మెడికల్‌కు వెళ్లి వస్తానని రూమ్‌లోని వారికి చెప్పి బయటికి వెళ్లాడు. వైన్‌షాపునకు వెళ్లి మద్యం సేవించిన ఆనంద్‌.. రూమ్‌కి తిరిగి వెళ్లలేదు. బుధవారం ఉదయం ఓ దుకాణం ఎదుట రక్తపు మడుగులో యువకుడు పడి ఉండడంతో యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడిని ఆనంద్‌ బిహారీ పాండేగా గుర్తించిన పోలీసులు.. గుర్తు తెలియని వ్యక్తులు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మద్యం సేవించిన సమయంలో ఆనంద్‌కు ఇతరులతో గొడవ జరిగిందా? లేక మద్యం మత్తులో ఎవరితోనైనా గొడవపడ్డాడా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. వైన్‌షాపులోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. పోలీసు జాగిలాలు ఘటనాస్థలం నుంచి కొంత దూరంలోని వైన్‌షాపు వద్దకు వెళ్లి ఆగిపోయాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి, ఎస్సై పాండేరావు తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తాపడి యువకుడి మృతి



పృథ్విరాజ్‌ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అరాఫత్‌

బాల్కొండ: మండలంలోని నాగాపూర్‌లో ట్రాక్టర్‌ బోల్తా పడి గ్రామానికి చెందిన బొమ్మిడ్డ పృథ్విరాజ్‌(19) మృతి చెందాడు. బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై యాసర్‌ అరాఫత్‌ వెల్లడించారు.వివరాలు ఇలా ఉన్నాయి.. పృథ్వీరాజ్‌ సొంత ట్రాక్టర్‌ను డ్రైవింగ్‌ చేస్తూ శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ బ్యాక్‌వాటర్‌ ప్రాంతానికి వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు తిరగబడి బోల్తాపడింది. ఈ ఘటనలో పృథ్విరాజ్‌ ట్రాక్టర్‌కింద చిక్కుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో మేస్త్రి ..



షేక్‌ మహబూబ్‌ మృతదేహం

ఖలీల్‌వాడి: విద్యుత్‌షాక్‌తో మేస్త్రి మృతి చెందిన ఘటన నగరంలోని మూడో టౌన్‌పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఉన్న గౌతంనగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగారంలోని బహుజన కాలనీకి చెందిన షేక్‌ మహబూబ్‌(49) గౌతంనగర్‌లో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. సలాకాను పైఅంతస్తుకి తీసుకెళ్తుండగా విద్యుత్‌వైర్లు తగిలి షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ ఇద్దరు..

నవీపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన రెంజల్‌ మండలం వీరన్నగుట్టకు చెందిన తమ్మిడి ప్రవీణ్‌(31) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. మండలంలోని అబ్బాపూర్‌(ఎం)సమీపంలో బాసర రోడ్డుపై రెండు రోజుల క్రితం బైక్‌ అదుపుతప్పిన ఘటనలో ప్రవీణ్‌ గాయాలపాలుకాగా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారని, భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అబ్బాపూర్‌(బి) తండాకు చెందిన యువకుడు..

మండలంలోని అబ్బాపూర్‌(బి) తండాకు చెందిన నేనావత్‌ వినోద్‌(27) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను భరించలేక వినోద్‌ మంగళవారం పురుగుల మందు తాగాడని, గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వెల్మల్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసిన మూడు ఇళ్లల్లో చోరీ
- 18.5 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.11 లక్షల నగదు అపహరణ
- ఆధారాలు లభించకుండా కారంపొడి చల్లిన దుండగులు



చోరీ జరిగిన బర్లపాటి ప్రవీణ్‌ ఇల్లు



సామగ్రిని చిందరవందరగా పారేసిన దుండగులు

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండలంలోని వెల్మల్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన మూడు ఇళ్లలో మంగళవారం రాత్రి చోరీకి పాల్పడిన దుండగులు 18.5 తులాల బంగారం, 20 తులాల వెండి తోపాటు రూ.11 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెల్మల్‌లోని మార్కెట్‌ వీధిలో నివాసముంటున్న ఆర్‌ఎంపీ బొడ్డు చంద్రశేఖర్‌, డీకంపల్లి రోడ్‌లో ఉంటున్న బర్లపాటి ప్రవీణ్‌, ఆకుల సాగర్‌ ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో దుండగులు వాటిని ధ్వంసం చేసి ఇళ్లలోకి చొరబడ్డారు. బొడ్డు చంద్రశేఖర్‌ ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాను పగులగొట్టి రూ.10 లక్షల నగదు, 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. చంద్రశేఖర్‌కు ఇటీవలే పంట చీటీ డబ్బులు రూ.10 లక్షలు రాగా, అతడు ఇంట్లో పెట్టుకున్నాడు. అలాగే బర్లపాటి ప్రవీణ్‌ ఇంట్లో నుంచి 8.5 తులాల బంగారం, 20 తులాల వెండి, 25 వేల నగదు, ఆకుల సాగర్‌ ఇంట్లో నుంచి రెండు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. దుండగులు ఆధారాలు లభించకుండా మూడిళ్లలో కారంపొడి చల్లి పరారయ్యారు. ఈ ఘటనతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

సీసీ ఫుటేజీలో కదలికలు..

వెల్మల్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చినట్లు సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. దుండగులు ఇద్దరూ దర్జాగా బైక్‌పై వచ్చి ప్రహరీ పైనుంచి లోనికి దూకి తాళాలు ధ్వంసం చేసిన దృశ్యాలు రికార్డయ్యాయి. బుధవారం ఉదయం ఘటనాస్థలానికి పోలీసులు, క్లూస్‌ టీం చేరుకొని ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు.

దంపతుల ఆత్మహత్య కేసులో..

మృతురాలి పిన్ని అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ శ్రీనివాస్‌

ఖలీల్‌వాడి: పిన్ని తమపై దుష్ప్రచారం చేస్తోందని మనస్తాపంతో రైలుకు ఎదురెళ్లి దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో నిందితురాలిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పొతంగల్‌ మండలం హెగ్డోలికి చెందిన బండారి అనిల్‌కుమార్‌, శైలజ దంపతులు సోమవారం రాత్రి నవీపేట-మిట్టాపల్లి మధ్య రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు శైలజ తమ పిన్ని కక్కోళ్ల లక్ష్మి దుష్ప్రచారం చేస్తోందని, తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని సెల్ఫీ వీడియో చేసింది. ఈ కేసులో లక్ష్మిని అరెస్టు చేశామని, సికింద్రాబాద్‌లోని రైల్వే కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. సమావేశంలో రైల్వే ఎస్సై సాయిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్‌ సిలిండర్‌ పేలి ఇల్లు ధ్వంసం



ధ్వంసమైన ఇంటి పైకప్పు



పేలిన గ్యాస్‌ సిలిండర్‌

భిక్కనూరు: ప్రమాదవశాత్తు గ్యాస్‌ సిలిండర్‌ పేలి ఇల్లు ధ్వంసమైన ఘటన మండలంలోని పెద్ద మల్లారెడ్డిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సత్తెవ్వ అనే వృద్ధురాలు రేకుల ఇంట్లో నివాసం ఉంటోంది. బుధవారం ఆమె ఇంటి బయట పనులు చేస్తుండగా ఇంట్లోని గ్యాస్‌ సిలిండర్‌ పేలడంతో ఇంటి పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. పెద్ద ఎత్తున శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఘటనాస్థలానికి చేరుకున్నారు. గ్యాస్‌ సిలిండర్‌ పేలుడు కారణంగా అప్పటికే ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంట్లో వృద్ధురాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న భారత్‌గ్యాస్‌ నిర్వాహకులు గ్రామానికి చేరుకొని పేలిన సిలిండర్‌ను పరిశీలించారు. ఈ ప్రమాదంలో సత్తవ్వ దాచుకున్న పింఛన్‌ డబ్బులు కాలిపోయాయి. బాధితురాలిని మాజీ ఎంపీటీసీ సభ్యులు కోడూరి సాయాగౌడ్‌ పరామర్శించి అధికారులకు సమాచారం అందించారు.

గ్యాస్‌వెల్డింగ్‌ దుకాణంలో చోరీ

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని శక్కర్‌నగర్‌ చౌరస్తాలో ఉన్న జమీర్‌ అనే వ్యక్తికి చెందిన గ్యాస్‌ వెల్డింగ్‌ దుకాణంలో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. గ్యాస్‌ వెల్డింగ్‌ మిషన్‌ తోపాటు ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం దుకాణం తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు జమీర్‌కు సమాచారమిచ్చారు. దుకాణానికి చేరుకున్న అతడు దుకాణంలోని సామగ్రి లేకపోవడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనాస్థలాన్ని సీఐ వీరయ్య పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జక్రాన్‌పల్లి రైతు వేదికలో..



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. కెమెరాతోపాటు మైక్‌సెట్‌ను ఎత్తుకెళ్లారు. ఏఈవో వెంకటేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్‌ తిరుపతి తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి క్లూస్‌ టీం ద్వారా ఆధారాలు సేకరించారు.